క్లుప్తంగా

మెరుగైన వైద్యం అందించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ సూచించారు. బుధవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన కంటి వైద్యశిబిరాన్ని కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి ఎమ్మెల్యే దంపతులు సందర్శించారు. నెన్నెల మండల పేదప్రజలకు కంటి చూపు ప్రసాదించడానికి నిర్వాహకులు వర్ష చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ఆర్డీవో హరికృష్ణ, ఏసీపీ రవికుమార్, వైద్యులు, సిబ్బంది, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

శివాలయంలో దీపోత్సవం


దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చెన్నూర్: అయోధ్యలో బలరాముని ప్రాణప్రతిష్ఠ చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా చెన్నూర్ శివాలయంలో బుధవారం దీపోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు జైశ్రీరామ్ ఆకారంలో దీపాలు వెలిగించారు.

రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి కృషి


రోడ్డు ప్రారంభిస్తున్న వివేక్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అన్నివార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి కృషి చేస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మున్సిపాలిటీలోని 7వ వార్డులో రూ.30 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఈ ప్రాంతప్రజలు సీసీ రోడ్లు, డ్రెయినేజీల సమస్య గురించి చెప్పారని, ఒక్క 7వ వార్డులోనే రూ.2 కోట్లకు పైగా నిధులు వెచ్చించి రోడ్లు నిర్మించామన్నారు. నియోజకవర్గంలో అధికంగా టీయూఎఫ్ఐడీసీ నిధులు రాబట్టేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అమృత్ స్కీం ద్వారా మున్సిపాలిటీలో మంచినీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, ఏఈ అచ్యుత్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, కౌన్సిలర్ పోలం సత్యం తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలికకు అండగా..

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన మంద అక్షితకు రెండేళ్ల క్రితం తల్లి అనారోగ్యంతో మరణించగా, 20 రోజుల క్రితం తండ్రి బైక్ ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అనాథగా మారిన బాలికకు దండేపల్లి సత్యసాయి భజన మండలి అండగా నిలిచింది. రూ.25 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందించారు. మండలి కన్వీనర్ రాపర్తి రాజన్న, సేవాదళ్ కోఆర్డినేటర్ పసుపునూటి సాయిరాం, జాయింట్ కోఆర్డినేటర్ తాళ్ల కుమారస్వామిగౌడ్, యువ చైతన్య యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ రవి పాల్గొన్నారు.

మామిడిపల్లిలో ఆర్థికసాయం..

మండలంలోని మామిడిపల్లికి చెందిన శ్రీనివాస్ అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో అతనిది నిరుపేద కుటుంబం కావడంతో మిత్రులు బుధవారం రూ.5 వేల ఆర్థికసాయం అందించారు.

ఇన్వర్టర్ అందజేత

చెన్నూర్: చెన్నూర్ గ్రంథాలయానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఇన్వర్టర్‌ను అందజేసినట్లు ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రఫణి తెలిపారు. ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి, గ్రంథాలయ అధికారి అనిల్, జిల్లా ఉపాధ్యక్షులు ఖంరొద్దీన్, పుప్పాల ప్రవీణ్‌కుమార్, మేడ శ్రావణ్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

'ఆరోపణలు మానుకోవాలి'

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలిపేందుకు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు కృషి చేస్తున్నారని పట్టణ కాంగ్రెస్ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని గోదావరి నది సమీపంలో నిర్మిస్తున్న మహాప్రస్థానం వద్ద బుధవారం వారు విలేకర్లతో మాట్లాడారు. శ్మశాన వాటికను నిర్మించేందుకు మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో నాలుగు ఎకరాల్లో రూ. 11 కోట్లతో మహాప్రస్థానం పనులు చేస్తుండగా, ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలను చేయడం మానుకోవాలని హితవు పలికారు. తిరుపతి, నరేశ్, హేమలత, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్
- రెండోరోజూ కొనసాగిన గ్రామసభలు


తాండూర్: గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

తాండూర్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మండలంలోని తాండూర్, అచ్చలాపూర్‌లో బుధవారం నిర్వహించిన గ్రామసభలకు ఆయన హాజరై మాట్లాడారు. జాబితాలో లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల గ్రామస్తుల కోరిక మేరకు నర్సాపూర్‌లో మంజూరైన రేషన్ షాపు మంజూరు పత్రాలను గిరిజనులకు అందజేశారు. అచ్చలాపూర్ శివారు లక్ష్మీనరసింహ స్వామి ఆలయ నిర్మాణానికి సహకరించాలని పలువురు కోరడంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అచ్చలాపూర్ గ్రామసభలో పలువురు ఎమ్మెల్యేతో మాట్లాడేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. రుణమాఫీ మంజూరు కాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తాండూరు సీఐ కుమారస్వామి, తాండూర్, మాదారం, భీమిని ఎస్సైలు, కానిస్టేబుళ్లు భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కార్యక్రమాల్లో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, మండల ప్రత్యేక అధికారి అంజయ్య, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఈసా పాల్గొన్నారు.

నస్పూర్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ సురమిల్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీశ్ తెలిపారు. పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభల్లో వారు పాల్గొన్నారు. అనంతరం పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, ఆర్ఐలు మాంతయ్య, చందర్, కౌన్సిలర్ తోట శ్రీనివాస్, పలువురు కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డుల్లో బుధవారం వార్డుసభలు నిర్వహించారు. జాబితాల్లో పేర్లు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సూచించారు. 7వ వార్డు రామాలయం ఏరియాలో జరిగిన వార్డు సభలో కాంగ్రెస్ నాయకులు జాబితాలో పేర్లు చదవడం ఏమిటని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ ప్రశ్నించారు. పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద్, కొమ్మెర, కిష్టంపేట, అంగ్రాజ్‌పల్లి, సుద్దాల, ఎర్రగుంటపల్లి, రచ్చపల్లి, సోమన్‌పల్లి, కాచన్‌పల్లి, గంగారం, ఒత్కులపల్లి గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ప్రభుత్వ పథకాల ఎంపికలో నిర్లక్ష్యం జరిగిందని అధికారులను గ్రామస్తులు నిలదీశారు. గంగారంలో కార్యదర్శి నిర్లక్ష్య సమాధానాలు ఇస్తున్నారంటూ మండిపడ్డారు. కాచన్‌పల్లి గ్రామంలో స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో మోహన్ గంట ఆలస్యంగా రావడంతో మధ్యాహ్నం 3 గంటలకు గ్రామసభ ప్రారంభమైంది.

బెల్లంపల్లిరూరల్: మండలంలోని లంబాడి తండా, పెర్కపల్లి, దుగ్నెపల్లి, మాలగురిజాల, గురిజాల, చంద్రవెల్లి, కన్నాల, అంకుశం గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. పథకాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్, తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలో రెండో రోజు గ్రామసభలు కొనసాగాయి. చింతపల్లి, ముత్యంపేట, కొర్విచెల్మ, రెబ్బనపల్లి, గూడెం, కన్నెపల్లి, నెల్కివెంకటాపూర్, నర్సాపూర్, ద్వారక, ధర్మారావుపేట గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. జాబితాలో పేర్లు రానివారు మళ్లీ దరఖాస్తులు చేసుకున్నారు. తహశీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, డీటీ విజయ, ఏవో అంజిత్‌కుమార్, ఆర్ఐ భూమన్న, కార్యదర్శులు పాల్గొన్నారు.

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో గ్రామసభలు కొనసాగుతున్నాయి. పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండల ప్రత్యేక అధికారి శంకర్, ఎంపీడీవోలు గంగామోహన్, శంకర్, తహసీల్దార్లు వికర్ణదాస్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

జైపూర్: ఇందారం, రామారావుపేట, టేకుమట్ల, గంగిపల్లి గ్రామాల్లో అధికారులు అర్హుల జాబితాలను చదివి వినిపించారు. మండల ప్రత్యేక అధికారి గణపతి, ఎంపీవో శ్రీపతిబాపురావు పాల్గొన్నారు.

బందోబస్తు మధ్య గ్రామసభ


సర్దిచెప్తున్న పోలీసులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నర్సింగాపూర్‌లో బుధవారం గ్రామసభ పోలీస్ బందోబస్తు మధ్య సాగింది. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో గ్రామం విలీనంపై స్థానికులు ప్రశ్నించారు. పంచాయతీలో ఎలాంటి తీర్మానం లేకుండా కార్పొరేషన్‌లో కలపాలని ఎలా అనుకూల తీర్మానం ఇస్తారని మండిపడ్డారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రావుదేశ్‌పాండే మాట్లాడుతూ కలెక్టర్ గ్రామాన్ని సందర్శించి తుది నిర్ణయం తీసుకుంటారన్నారు. తీర్మానంలో ఎవరి సంతకాలు ఉన్నాయో కార్యదర్శి తమకు చూపించాలని ఎంపీవో ఉమర్ షరీఫ్, కార్యదర్శి సరితపై ఒత్తిడి తీసుకువచ్చారు. మరో గ్రామసభ ఏర్పాటు చేసి సందేహాలు తీరుస్తామని తహసీల్దార్, ఎస్సై గోపతి సురేశ్ చెప్పినా వినలేదు. పోలీస్ బందోబస్తు మధ్య కార్యదర్శిని అక్కడ నుంచి పంపించివేశారు.

వార్డు సభలు ప్రారంభం


రాజీవ్‌నగర్‌లో గొడవపడుతున్న స్థానికులు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో బుధవారం 1 నుంచి 12వ వార్డు వరకు వార్డు సభలు నిర్వహించారు. జాబితాలో అర్హుల పేర్లను అధికారులు చదివి వినిపించారు. రాజీవ్‌నగర్‌లో స్థానికుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో, కొంతసేపు సభను నిలిపివేశారు. గొడవ సద్దుమణిగిన అనంతరం సభ కొనసాగించారు. రాజీవ్‌నగర్, ఎన్టీఆర్‌నగర్, తిలక్‌నగర్, ఏసీసీ వార్డు సభలకు ప్రజలు వచ్చి, తమపేర్లు రాలేదని మరోసారి నమోదు చేయించుకున్నారు.

నేడు వార్డుసభలు..

మున్సిపాలిటీలో 13 నుంచి 24వ వార్డుల వరకు గురువారం వార్డుసభలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మారుతిప్రసాద్ తెలిపారు. దరఖాస్తుదారులతోపాటు, వార్డుప్రజలు హాజరుకావాలని కోరారు.

సమాచారం ఇవ్వలేదని నిరసన..


గ్రామ సభలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు

జన్నారం: గ్రామసభపై కార్యదర్శి సమాచారం ఇవ్వలేదని, ఎలాంటి పథకాలకు ఎంపిక చేయలేదని మండలంలోని కామన్‌పల్లి పంచాయతీ పరిధి నాయకపుగూడేనికి చెందిన గిరిజనులు బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గ్రామ పెద్ద మూతి గంగన్న మాట్లాడుతూ గ్రామ కార్యదర్శి ప్రభుత్వ పథకాలపై సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు. కొందరు నాయకులు తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

రేండ్లగూడలో..

ప్రజాపాలన గ్రామసభలు గందరగోళానికి దారితీశాయి. బుధవారం రెండోరోజు రేండ్లగూడ, పొనకల్‌లో నిర్వహించిన గ్రామసభల్లో అనర్హులకు పథకాలు ఎంపిక చేశారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేండ్లగూడలో పథకాల గురించి మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ వివరిస్తుండగా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అనర్హులను ఎంపిక చేశారంటూ కొందరు యువకులు ఆందోళన చేశారు. పొనకల్‌లో తమ పేరు రాలేదని మహిళలు నిలదీశారు. ఎంపీడీవో శశికళ, పశువైద్యాధికారి శ్రీకాంత్‌లు వారిని సముదాయించారు.

జాబితాల్లో పేర్లు లేవని మండిపాటు

కోటపల్లి: మల్లంపేట గ్రామసభలో జాబితాలో తమ పేర్లు లేవని గ్రామస్తులు అధికారులపై మండిపడ్డారు. ఇప్పటికే దరఖాస్తులు ఇచ్చామని మళ్లీ ఎలా చేసుకుంటామని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఎంపికలో జాబితా గందరగోళంగా ఉందన్నారు.

పత్రికలు ప్రజల పక్షాన ఉండాలి

- రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

పాతమంచిర్యాల: పత్రికలు ప్రజల పక్షాన ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నార్తిఇన్ హోటల్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మంచిర్యాల శాఖ ఆధ్వర్యంలో ×ప్రజాస్వామ్యం–మీడియా బాధ్యత×పై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న ప్రతీ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని, రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో చైతన్యపర్చాలని తెలిపారు. 2007లో జర్నలిస్టుల వేతన సంఘం చేసి 2010లో అమలుకు సిఫారసు చేశామని, ఇందులో 12 రకాల వేతనాలను నిర్ధారించారని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర నాయకులు నగునూరి శేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపిరెడ్డి ప్రకాష్‌రెడ్డి, జిల్లా శాఖ అధ్యక్షుడు డేగ సత్యం, డీపీఆర్వో జే.శారద, టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి పింగలి సంపత్ రెడ్డి, కోశాధికారి కేశెట్టి వంశీకృష్ణ, పత్రికల ప్రతినిధులు ఆకుల రాజు, సురేష్‌చౌదరి, రవిరాజు, రాజలింగు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సెల్ సభ్యులకు వీడ్కోలు


చైర్‌పర్సన్ శ్వేతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ఈనెల 26వ తేదీతో ముగియనుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం రాత్రి వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ సమావేశ మందిరంలో 33 మంది కౌన్సెల్ సభ్యులు, నలుగురు కోఆప్షన్ సభ్యులకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ శాలువ కప్పి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పురప్రజలకు ఐదేళ్లపాటు సేవలు అందించారని అన్నారు. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ జె.శ్వేత, వైస్ చైర్మన్ సుదర్శన్ పాల్గొన్నారు.

మంచిర్యాలలో..

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పాలకవర్గం పదవీకాలం ఈనెల 26వ తేదీతో ముగుస్తుండగా, మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్‌లను కమిషనర్, అధికారులు, వార్డు కౌన్సిలర్లు బుధవారం సన్మానించారు. అనంతరం కౌన్సిలర్లను చైర్మన్, వైస్ చైర్మన్‌లు సత్కరించారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

జన్నారం: మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల ఎంవిఐ కిశోర్ చంద్ర తెలిపారు. పొనకల్ పంచాయతీ పరిధిలో శ్రీ రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాలలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలపై బుధవారం అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఆర్టీఏ మెంబర్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు రామాలయం చౌరస్తాలో బుధవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మంచిర్యాల ఏఎంవీఐ షేక్ ఖాసీం సాహెబ్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని ఈ సందర్భంగా స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్, మాజీ ఎంపీటీసీ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

భీమారం: రాష్ట్రంలో అర్హులందరికీ కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అందిస్తామని కాంగ్రెస్ జిల్లా నాయకుడు పొడేటి రవి తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క రేషన్ కార్డులు, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేసిందని గుర్తుచేశారు. సమావేశంలో మండల నాయకులు ఉస్కమల్ల పున్నం చందు, కొత్త సత్తిరెడ్డి, ఆవిడపు రవితేజ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

జన్నారం: టీడబ్ల్యూపీఎస్ ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఏటీడీవో పురుషోత్తం, ఎంఈవో ఎస్.విజయకుమార్ పేర్కొన్నారు. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శివరాజం ఆధ్వర్యంలో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలకు సంబంధించిన అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల అభివృద్ధిని యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

కోటపల్లి: క్రీడల్లో గెలుపోటములు సహజమని సీఐ సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని వెంచపల్లి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో మహారాష్ట్రలోని కోటపల్లి, వెంచపల్లి జట్లు బుధవారం ఫైనల్‌లో తలపడ్డాయి. ఫైనల్‌లో కోటపల్లి జట్టు విజేతగా వెంచపల్లి జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. గెలుపొందిన జట్లకు సీఐ సుధాకర్ బహుమతులు అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజమల్లగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేశ్‌తివారి, మాజీ సర్పంచ్ పడాల రాజుబాయి, సతీశ్, మాజీ ఎంపీటీసీ తిరుపతి, కో ఆప్షన్ సభ్యులు గరీబ్‌ఖాన్, నాయకులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

కోలిండియా పోటీల విజేతలకు సన్మానం


విజేతలను అభినందిస్తున్న ఏజెంట్ రాజేందర్

శ్రీరాంపూర్: కోలిండియా పోటీల్లో బహుమతి సాధించిన ఆర్కే న్యూటెక్ గని ఉద్యోగులను అధికారులు అభినందించి సన్మానించారు. ఇటీవల కోలిండియా జరిగిన సాంస్కృతిక పోటీల్లో గనిలో వెల్డర్‌గా పనిచేస్తున్న జంపయ్య ద్వితీయ బహుమతి సాధించాడు. కోల్‌కట్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అజయ్ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌లో బహుమతులను సాధించారు. బుధవారం గనిపై జరిగిన కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ రాజేందర్, గని మేనేజర్ స్వామిరాజు ఇద్దరిని సన్మానించారు. మిగతా ఉద్యోగులు వీరిని స్ఫూర్తిగా తీసుకుని రాణించాలన్నారు.

ఆర్థికసాయం అందజేత..

గనిలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబానికి అధికారులు, ఉద్యోగులు కలిసి ఆర్థికసాయం అందించారు. అందరూ కలిసి పోగుచేసిన రూ. 1,47,800 మొత్తాన్ని భార్య ఆస్మా బేగం ఏజెంట్ రాజేందర్ చెక్కు రూపంలో అందించారు. గని రక్షణాధికారి రమేశ్, సీనియర్ సంక్షేమ అధికారి పాల్‌సృజన్, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, పిట్ ఇంజినీర్ రాజగోపాలాచారి, సర్వే అధికారి విశ్వేశ్వరరావు, వెంటిలేషన్ అధికారి చంద్రమౌళి, అండర్ మేనేజర్లు సాత్విక్, మహేందర్, శశికుమార్ పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు సన్మానం

శ్రీరాంపూర్: సింగరేణి రెస్క్యూలో 25 ఏళ్లుగా సేవలందిస్తున్న జీఎం కార్యాలయం పర్సనల్ విభాగానికి చెందిన సీనియర్ అసిస్టెంట్ కన్నం సాంబయ్యను ఏరియా అధికారులు సన్మానించారు. బుధవారం జీఎం కార్యాలయం వద్ద జీఎం ఎల్వీ సూర్యనారాయణ ఆయన్ను శాలువతో సత్కరించారు. జీఎం మాట్లాడుతూ ఝార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్‌లో ఇటీవల జరిగిన 53వ జాతీయ రెస్క్యూ పోటీల్లో భాగంగా సాంబయ్య సేవలను గుర్తించి బీసీసీఎల్ యజమాన్యం సన్మానించి ప్రశంసాపత్రం అందజేసిందని తెలిపారు. ఏజీఎం (ఫైనాన్స్) మురళీధర్, ఏజీఎం(పర్సనల్) అరవిందరావు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

రామకృష్ణాపూర్: అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠాపన నిర్వహించి ఏడాది పూర్తయిన సందర్భంగా పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో బుధవారం సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలో మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ దంపతులు పాల్గొన్నారు.

గణతంత్ర ఏర్పాట్ల పరిశీలన

శ్రీరాంపూర్: పట్టణంలో ఈనెల 26న ప్రగతి మైదానంలో సింగరేణి ఆధ్వర్యంలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ బుధవారం పరిశీలించారు. ఆయా డిపార్టుమెంట్ల ముఖ్య అధికారులతో కలిసి మైదానాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ఎస్ఓటుజీఎం ఎస్.సత్యనారాయణ, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్‌కుమార్, రవీందర్ పాల్గొన్నారు.

కార్మిక కాలనీల్లో మెరుగైన రోడ్లు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కార్మిక కాలనీల్లో సింగరేణి మెరుగైన రోడ్ల సౌకర్యం కల్పిస్తోందని ఏరియా డీవైజీఎం (సివిల్) రాములు తెలిపారు. ఏరియాలోని ఫస్ట్ జోన్ సీఈఆర్ క్లబ్ ముందు ఉంచి పాతసినిమా హాల్ వరకు రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. రూ.1.10 కోట్లతో తారురోడ్డు వేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏరియా ఎస్ఈ జయప్రకాశ్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ, ఏరియా ఉపాధ్యక్షుడు సుదర్శన్, నాయకులు భానయ్య, రాజేశ్వరరావు, శంకర్ ఉన్నారు.

జేవీఆర్ ఆపరేటర్లు విధుల బహిష్కరణ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీలో ఓబీ పనులు నిర్వహిస్తున్న జీవీఆర్ కంపెనీలో పనిచేస్తున్న వోల్వో ఆపరేటర్లు బుధవారం విధులు బహిష్కరించారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ కంపెనీ యాజమాన్యానికి నోటీసును అందించారు. జేవీఆర్‌లో పనిచేస్తున్న 120 మందికి వేతనాలు పెంచాలని, బోనస్ చెల్లించాలని ఇంకా ఇతర డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ విధులు బహిష్కరించారు.

సంక్షిప్త వార్తలు

దివ్యాంగులకు ఉపాధి, పునరావాస పథకం

మంచిర్యాలటౌన్: దివ్యాంగులు వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలు, సేవా వ్యాపారాలను స్థాపించుకుని జీవనోపాధి పొందేందుకు ఉపాధి, పునరావాస పథకం అమలు చేస్తామని జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్ ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 23 యూనిట్ల ద్వారా రూ. 11.50 లక్షల రాయితీ మంజూరు చేస్తామని, ఆన్‌లైన్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు www.tgobmms.cgg. gov. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మైనార్టీ గురుకులాల్లో దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: వచ్చే విద్యా సంవత్సరానికిగాను మైనార్టీ గురుకుల పాఠశాలలు/కళాశాలల్లో ప్రవేశాల కోసం అభ్యర్థుల దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నీరటి రాజేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో మైనారిటీలకు ఫస్ట్ కమ్ ఫస్ట్, నాన్ మైనార్టీల కోసం లక్కీడిప్, 6, 7, 8 తరగతుల్లో (మైనార్టీ బ్యాక్‌లాగ్ ఖాళీలు) ఫస్ట్ కమ్ ఫస్ట్, ఇంటర్ ఫస్టియర్‌లో (జనరల్, ఒకేషనల్)లో పదో తరగతి 2025లో జీపీఏ ఆధారంగా మైనార్టీలకు 75 శాతం, నాన్ మైనార్టీలకు 25 శాతం సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. http://tmreis.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9705912145 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

తాత్కాలిక మెరిట్ జాబితా ప్రదర్శన

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని కేజీబీవీలు, బెల్లంపల్లి, కాసిపేట, బాలికల హాస్టల్ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిన పనిచేసే తాత్కాలిక మెరిట్ జాబితాను డీఈవో కార్యాలయం నోటీస్ బోర్డులో ప్రదర్శించినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 23 నుంచి 25 వరకు సాయంత్రం 5 గంటలలోగా అభ్యర్థులు తెలపాలని పేర్కొన్నారు.

పరామర్శ

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ముసిపట్ల సత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.